'రైలు'.. దిగులు..!

- యాదాద్రి పవర్ ప్రాజెక్టుపై అదానీ కన్ను!
- డోర్నకల్- మిర్యాలగూడ వరకు రైల్వేలైన్‌కు సర్వే
- ఖమ్మం జిల్లా ప్రజల్లో తీవ్ర ఆందోళన
- కోల్పోనున్న భూములు, ఇళ్లు
- సర్వేను అడ్డుకుంటున్నా పట్టువీడని 'కేంద్రం'

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

గౌతమ్ అదానీ సామ్రాజ్యం ఖమ్మం జిల్లా వరకొచ్చింది.. గ్రీన్‌ఫీల్డ్ హైవేలు, రోడ్లు, నూతన రైలుమార్గాలు, పవర్ ప్రాజెక్టుల రూపంలో ప్రభుత్వ, ప్రయివేట్ భూములు, ఆస్తులను కారుచౌకగా కాజేస్తున్న అతను.. తాజాగా నల్లగొండ జిల్లా మిర్యాలగూడ సమీపంలోని యాదాద్రి పవర్ ప్రాజెక్టుపై కన్నేసినట్టు తెలుస్తోంది. దీన్ని నయానో భయానో హస్తగతం చేసుకుంటే విద్యుదుత్పత్తికి కావాల్సిన బొగ్గు, ఇతరత్రా ఖనిజాలను సరఫరా చేసేందుకు నూతన రైల్వే మార్గం కోసం కేంద్రంతో ప్రయత్నాలు ముమ్మరం చేయించారు. ఇందుకు మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ నుంచి మిర్యాలగూడ వరకు నూతన రైల్‌మార్గం నిర్మించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు దక్షిణ మధ్య రైల్వే గతేడాది అక్టోబర్ 6వ తేదీన సర్వేకు అనుమతించింది. రైల్వే మంత్రిత్వశాఖ రూ.మూడు కోట్లు మంజూరు చేసింది. ఇప్పుడు ఈ సర్వే ఖమ్మం జిల్లా ప్రజానీకాన్ని ఆందోళనకు గురిచేస్తోంది.

జిల్లాలోని రఘునాథపాలెం మండలం మొదలు ఖమ్మం రూరల్, ముదిగొండ, నేలకొండపల్లి మండలాల మీదుగా సూర్యాపేట జిల్లా కోదాడ నుంచి నల్లగొండ జిల్లా మిర్యాలగూడ వరకు ప్రతిపాదనలు సిద్ధం చేసి అధికారులు సర్వే చేపడుతున్నారు. దీనిపై ఖమ్మం జిల్లాలో పెద్దఎత్తున ఆందోళనలు వెల్లువెత్తుతున్నాయి. ఖమ్మం నగరానికి సమీపంలో స్తంభాద్రి అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (సుడా) పరిధిలోని రూ.కోట్ల విలువ చేసే భూములు, ఇండ్లు, వెంచర్లు, ప్లాట్లు ఈ రైలుమార్గం కింద పోనున్నాయి. దాదాపు 300 అడుగుల వెడల్పుతో 90 కి.మీ పైగా నిర్మించే ఈ రైల్వేలైన్‌తో ఖమ్మం రూరల్ మండలంలోనే 800 ఎకరాల వరకు భూములు సేకరించనున్నట్టు అంచనా.

సర్వేను అడ్డుకుంటున్న నిర్వాసితులు

డోర్నకల్ నుంచి జిల్లాలోని మల్లెమడుగు రైల్వే స్టేషన్ మీదుగా ఖమ్మం రూరల్ మండలం పల్లెగూడెం, ముత్తగూడెం, ఏదులాపురం, మద్దులపల్లి, తెల్దారుపల్లి, ముదిగొండ, నేలకొండపల్లి మండలాల్లోని గువ్వలగూడెం, నేలకొండపల్లి, ఆచార్లగూడెం, కోనాయిగూడెం, బోదులబండ, రామచంద్రాపురం, పైనంపల్లి తదితర ప్రాంతాల మీదుగా కోదాడ, హుజూర్‌నగర్, మిర్యాలగూడెం వరకు నిర్మించాలనేది ప్రతిపాదన. ఇప్పటికే గూగుల్ మ్యాప్ ఆధారంగా సర్వే చేపట్టారు. నేలకొండపల్లి వరకు గతంలోనే ఈ సర్వే పూర్తి చేశారు. తాజాగా ఖమ్మం రూరల్ మండలంలో చేపట్టిన సర్వేను సిపిఎం, సిపిఐ, వివిధ రాజకీయ పార్టీల ఆధ్వర్యంలో ఎక్కడికక్కడ సిబ్బందిని అడ్డుకుంటున్నారు. ముత్తగూడెం, పల్లెగూడెంలో సర్వే సిబ్బందిని వెనక్కి పంపారు.

భూములకు ముప్పు

పవర్‌ప్లాంట్, సిమెంట్ కంపెనీల కోసం వేస్తున్న ఈ రైల్వేలైన్ వల్ల ప్రజలు తీవ్రంగా నష్టపోనున్నారు. ప్రజలు చేమటోడ్చి, పైసా పైసా కూడబెట్టి నిర్మించుకున్న వందలాది ఇళ్లు, ముత్తగూడెం, ఏదులాపురం, మద్దులపల్లి, తెల్దారుపల్లి తదితర రెవెన్యూలో వెంచర్లు, ప్లాట్లు రైలుమార్గంలో పోనున్నాయి. ఇటీవల నిర్వహించిన సర్వే ప్రకారం ఏదులాపురం పెట్రోల్ బంక్ సమీపంలోని కోటి ధాబా, ఆదిత్య టౌన్‌షిప్, వెంకటాద్రినగర్, ఆటోనగర్, మద్దులపల్లి అగ్రికల్చర్ మార్కెట్ తదితర ప్రాంతాల్లో రూ.కోట్ల విలువ చేసే అనేక ఇళ్లు, ప్లాట్లు, భూములు పోతున్నాయి. ఆయా రెవెన్యూలలో బహిరంగ మార్కెట్లో గజం విలువ రూ.10వేల పైమాటే ఉన్నా రిజిస్ట్రేషన్ విలువపై మూడంతలు ఇచ్చినా రూ.4వేలలోపే ప్రభుత్వం లెక్కలు కడుతుంది. ఎకరం రూ.3 కోట్లకు పైగా విలువ చేసే భూములకు రూ.30లక్షల లోపే చెల్లిస్తానంటోంది. నూతనంగా వేసిన డిటిసిపి లేఅవుట్ వెంచర్ల యజమానుల పరిస్థితి మరింత దారుణంగా మారింది. గ్రీన్‌బెల్ట్, మార్టుగేజ్‌లు, 60 అడుగుల వెడల్పు రోడ్లతో ఎకరం భూమిలో 18లోపు ప్లాట్లే అయ్యాయి. ఇప్పుడు ఈ రైల్వేలైన్‌తో అక్కడి రిజిస్ట్రేషన్ విలువపై మూడింతలు అధికంగా ఇస్తే గజం రూ.3వేల వరకే పలికే అవకాశం ఉంది. పై పెచ్చు 300 ఫీట్ల వెడల్పుతో వేసే ఈ రైల్వేలైన్ వల్ల దానికి ఇరువైపులా మరో వంద అడగుల మేర ఎటువంటి నిర్మాణాలున్నా నిరుపయోగంగా మారనున్నాయి. వీటికి ప్రభుత్వం నుంచి ఎటువంటి పరిహారం అందే అవకాశం లేకుండా పోవడంతో బిల్డర్లు, ఇండ్ల యజమానులు, నిర్వాసితులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఇండ్లు కొంటరో.. లేదోనని భయం

లక్ష్మణ్- న్యూ బిల్డర్- వెంకటాద్రినగర్- ఏదులాపురం

నూతనంగా మేము కడుతున్న ఇంటి సమీపం నుంచి రైల్వేలైన్ కోసం మార్కింగ్ చేశారు. ఎన్నో వ్యయప్రయాసలకు ఓర్చి సుతారి పనిచేసుకుని ఇప్పుడిప్పుడే బిల్డర్లుగా ఒకటి, రెండు ఇల్లులు నిర్మించి అమ్ముకుంటున్నాం. ఇప్పుడీ రైల్వేలైన్ మేము కొత్తగా కట్టే ఇండ్ల దగ్గరి నుంచి పోతుండటంతో వాటిని ఎవరన్నా కొంటారో లేదోనని భయంగా ఉంది. రైల్వేలైన్ కింద ఇళ్లు పోవట్లేదు కాబట్టి పరిహారం కూడా రాదు. మా పరిస్థితి ఏంటో అర్థం కావట్లేదు.

అలైన్‌మెంట్ మార్పుకు కృషి

నామ నాగేశ్వరరావు- ఖమ్మం ఎంపి

ఈ రైల్వేలైన్ వల్ల అనేక మంది నిర్వాసితులుగా మారే అవకాశం ఉంది. ఇప్పటికే రోడ్ల విస్తరణ, జాతీయ ప్రాజెక్టుల కోసం వేలాది ఎకరాల భూములు జిల్లా నుంచి సేకరించారు. కొత్తగా ఈ రైలుమార్గంతో ప్రజలు ఇబ్బంది పడతున్నారనే విషయాలను ఉటంకిస్తూ రైల్వేమంత్రికి లేఖ రాసి, అలైన్‌మెంట్ మార్చేందుకు కృషి చేస్తాను. నిర్వాసితుల పక్షాన ఎందాకైనా పోరాడుతాను.

ముగిసిన రంజాన్ వేడుకలు

- చార్మినార్, మక్కా మసీదు వద్ద ముస్లిముల ప్రార్థనలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలోని వివిధ జిల్లాలపాటు రాజధాని హైదరాబాద్ నగరంలో రంజాన్ వేడుకలు ఘనంగా ముగిశాయి. మార్చి 22 నుంచి ఏప్రిల్ 21 వరకు ముస్లిం సోదరులు భక్తిశ్రద్ధలతో ఉపవాస దీక్షలు చేశారు. రంజాన్ పండుగ సందర్భంగా మసీదులన్నీ కొత్త కళను సంతరించుకున్నాయి. చార్మినార్, మక్కా మసీద్ వద్ద రంజాన్ సందర్భంగా ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఉదయం 9:30 తర్వాత చార్మినార్, మక్కా మసీదు వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేశారు. నెల రోజుల కఠిన ఉపవాస దీక్ష తర్వాత వారు రంజాన్‌ను శనివారం ఘనంగా జరుపుకున్నారు. ఒకరినొకరు ఆలింగనం చేసుకుంటూ ముస్లిం సోదరులు పండుగ శుభాకాంక్షలు చెప్పుకున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు భారీ బందోబస్తు నిర్వహించారు. ప్రతి మసీదు వద్ద పోలీసులు నిఘా ఏర్పాటు చేశారు.

హోం మంత్రి ఇంటికి సిఎం

- రంజాన్ వేడుకలకు హాజరు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకుని రాష్ట్ర హోంమంత్రి మహమూద్ అలీ ఇంటికి సిఎం కెసిఆర్ వెళ్లారు. హోం మంత్రి నివాసంలో నిర్వహించిన రంజాన్ వేడుకల్లో శనివారం ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహమూద్ అలీ కుటుంబ సభ్యులకు కెసిఆర్ రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. సాంప్రదాయపద్ధతిలో వారు ఏర్పాటు చేసిన ఆతిథ్యాన్ని తన వెంట వచ్చిన మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు తదితర ప్రజాప్రతినిధుల బృందంతో కలిసి స్వీకరించారు. ఈ సందర్భంగా రంజాన్ మాసంలో ఆచరించే పవిత్ర ఉపవాస దీక్షలు, దైవ ప్రార్థనలు, ఆ సందర్భంగా పెంపొందే క్షమాగుణం, కరుణ, ప్రేమ తదితర ఆధ్యాత్మిక భావనలతో పాటు రంజాన్ పండుగ ప్రాశస్త్యం గురించి సిఎం స్మరించుకున్నారు. ఈ సందర్భంగా తనకు పండుగ శుభాకాంక్షలు తెలిపేందుకు వచ్చిన పలువురు మత పెద్దలు, సామాన్యులను పేరు పేరునా పలకరించి, అలాయ్ బలాయ్ తీసుకుని వారికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఉద్యమకాలం నుంచి నేటి వరకు తనతో కొనసాగుతున్న సీనియర్ కార్యకర్త సత్తార్ గుల్షనీని పేరు పెట్టి పిలిచి దగ్గరకు తీసుకుని ఆప్యాయంగా ఆలింగనం చేసుకున్నారు. కార్యక్రమంలో మంత్రులు కొప్పుల ఈశ్వర్, ప్రశాంత్ రెడ్డి, సత్యవతి రాథోడ్, పువ్వాడ అజయ్ కుమార్, ఎంపీలు కె.కేశవరావు, జోగినపల్లి సంతోష్ కుమార్, ఎమ్మెల్సీలు కడియం శ్రీహరి, మధుసూదనాచారి, పల్లా రాజేశ్వర్ రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే దానం నాగేందర్, నగర మేయర్ విజయలక్ష్మీ, మాజీ మేయర్ బొంతు రామ్మోహన్, పలు కార్పొరేషన్ల చైర్మెన్లు మసీఉల్లాఖాన్,సలీం, రవీందర్ సింగ్, మేడే రాజీవ్ సాగర్, సీనియర్ నేతలు మొయిత్ ఖాన్ పాల్గొన్నారు.

ఐసిఐసిఐ బ్యాంక్‌కు రూ.9,122 కోట్ల లాభాలు

ముంబయి : ప్రయివేటు రంగంలోని ఐసిఐసిఐ బ్యాంక్ 2023 మార్చి 31తో ముగిసిన త్రైమాసికంలో 30 శాతం వృద్ధితో రూ.9,121.87 కోట్ల నికర లాభాలు సాధించింది. ఇంతక్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో రూ.7,018. 71 కోట్ల లాభాలు నమోదు చేసింది. ప్రతీ ఈక్విటీ షేర్‌కు రూ.8 తుది డివిడెండ్‌ను ప్రకటిం చింది. 2022- 23 మార్చితో ముగిసి న త్రైమాసికంలో బ్యాంక్ మొత్తం ఆదాయం 32 శాతం పెరిగి 36,108.88 కోట్లకు చేరింది. మొత్తం డిపాజిట్లు 10.9 శాతం పెరిగి రూ.11,80,841 కోట్లకు చేరాయి. నికర నిరర్థక ఆస్తులు 0.48 శాతానికి తగ్గాయి. ఇంతక్రితం డిసెంబర్ త్రైమాసికంలో ఇవి 0.55 శాతంగా ఉన్నాయి.

కేసు దర్యాప్తు పారదర్శకంగా జరుగుతుంది

- డాక్టర్ ప్రీతి తండ్రి నరేందర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో



రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించిన కాకతీయ వైద్య కళాశాల విద్యార్థిని డాక్టర్ ధారావత్ ప్రీతి ఆత్మహత్య కేసు విచారణపై పూర్తి నమ్మకం కలిగిందని ఆమె తండ్రి నరేందర్ తెలిపారు. ఈ మేరకు శనివారం ఆయన వరంగల్ పోలీస్ కమిషనర్ రంగనాథ్‌ను కలిసిన అనంతరం మీడియాతో మాట్లాడారు. కేసుపై నెలకొన్న సందేహాలను నివృత్తి చేసుకున్నామన్నారు. పోస్టుమార్టం నివేదికపై వివరాలను సిపిని అడిగి తెలుసుకున్నానని చెప్పారు. కేసు దర్యాప్తు పారదర్శకంగా జరుగుతుందన్నారు. నిందితుడికి కఠిన శిక్ష పడేలా చర్యలు తీసుకోవాలని సిపిని కోరినట్లు నరేందర్ తెలిపారు. "కేసుపై ఉన్న సందేహాలను సిపిని అడిగి తెలుసుకున్నాను. ప్రీతిది ఆత్మహత్యే అని చెబుతున్నారు. దీనికి సంబంధించి కొన్ని ఆధారాలను కూడా చూపించారు. త్వరలో ఛార్జ్‌షీట్ దాఖలు చేస్తామని చెప్పారు" అని ప్రీతి తండ్రి నరేందర్ మీడియాకు వెల్లడించారు. ప్రీతి మృతి కేసులో కీలకమైన పోస్టుమార్టం నివేదిక వివరాలను వరంగల్ సిపి రంగనాథ్ శుక్రవారం వెల్లడించారు. గతంలో ప్రీతి రక్తనమూనాల్లో కూడా ఎలాంటి ఆనవాళ్లు కనిపించకపోవడంతో ఆమె మృతిపై ఇన్నాళ్లూ స్పష్టత రాలేదు. 50 రోజుల తర్వాత పోస్టుమార్టం నివేదిక ఆధారంగా ప్రీతిది ఆత్మహత్యేనని పోలీసులు స్పష్టం చేశారు. కాగా తాజా నివేదికను రుజువుగా చూపి సైఫ్ వేధింపుల వల్లే ప్రీతి బలవన్మరణానికి పాల్పడిందనే కోణంలో పోలీసులు న్యాయస్థానంలో త్వరలో అభియోగ పత్రం (ఛార్జ్‌షీట్) దాఖలు చేయనున్నారు. ఇటీవల నిందితుడు సైఫ్‌కు బెయిల్ మంజూరైన సంగతి తెలిసిందే.

30న కానిస్టేబుల్ పరీక్ష

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఈనెల 30న జరిగే కానిస్టేబుల్, తత్సమాన పోస్టులకు తుది రాతపరీక్షకు అన్ని ఏర్పాట్లను పూర్తి చేశామని తెలంగాణ రాష్ట్ర స్థాయి పోలీసు రిక్రూట్‌మెంట్ బోర్డు (టిఎస్‌ఎల్‌పిఆర్‌బి) చైర్మన్ వి.వి శ్రీనివాసరావు తెలిపారు. హైదరాబాద్‌తో పాటు శివారు ప్రాంతాల్లో పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్టు ఆయన చెప్పారు. 30వ తేదీన ఉదయం 10 గంటల నుంచి 1 గంట వరకు ఒక పరీక్ష ఉంటుందనీ, మధ్యాహ్నం 2.30 గంటల నుంచి 5.30 గంటల వరకు కానిస్టేబుల్ ఐటీ అభ్యర్థులకు పరీక్ష ఉంటుందని ఆయన తెలిపారు. నిర్ణీత సమయంలోగా అభ్యర్థులు పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలనీ, పరీక్ష నిర్వహణ కోసం బోర్డు విధించిన నిబంధనలను ఖచ్చితంగా పాటించాలని కోరారు. ఈ పరీక్ష నిర్వహణకు అవసరమైన పోలీసు అధికారులు, సిబ్బందిని నియమించడం జరిగిందని చెప్పారు. కాగా, ఈనెల 24 నుంచి 28వ తేదీ వరకు అభ్యర్థులు తమ హాల్ టికెట్లను అధికారిక వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలని తెలిపారు.

చరిత్ర, సైన్స్‌పై కేంద్రం దాడి

- టిఎస్‌యుటిఎఫ్ ఖండన

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

చరిత్ర, సైన్స్‌పై కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ దాడి చేస్తున్నదని తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ విమర్శించింది. ఈ చర్యను తీవ్రంగా ఖండిస్తున్నట్టు ప్రకటించింది. ఈ మేరకు టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు కె జంగయ్య, ప్రధాన కార్యదర్శి చావ రవి శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఎన్‌సిఇఆర్‌టి సిలబస్ నుంచి జీవ పరిణామ క్రమం, పునరుత్పత్తి పాఠ్యాంశాలను తొలగించటం సరైంది కాదని తెలిపారు. చరిత్ర నుంచి మొఘలుల చరిత్ర, గాంధీ హత్య, గుజరాత్ అల్లర్లు తదితర పాఠ్యాంశాలను తొలగించటాన్ని తీవ్రంగా ఖండించారు. నూతన విద్యావిధానం పేరుతో భారతీయ సమాజంపై కేంద్ర ప్రభుత్వ ధ్వంస రచన ప్రారంభమైందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికే దేశవ్యాప్తంగా ఉన్న ఉన్నత శాస్త్ర సాంకేతిక విద్యాసంస్థలకు చెందిన 1,800 మంది సైన్స్ అధ్యాపకులు, శాస్త్రవేత్తలు ఎన్‌సిఇఆర్‌టి చర్యలను తప్పుపడుతూ ఆ సంస్థ డైరెక్టర్‌కు లేఖలు రాశారని గుర్తు చేశారు.

గూడు కోసం పోరాడి ఓడిన సగటు జీవి

- గుండెపోటుతో మృతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సొంత ఇల్లు లేదు.. కనీసం జాగా లేదు.. ఇంటి కిరాయి కట్టలేక.. ఆర్థిక ఇబ్బందులతో సతమతమై.. డబుల్ బెడ్‌రూమ్ కోసం పోరాడి అలసిపోయిన సగటు మైనార్టీ జీవి చివరకు రంజాన్ రోజే ప్రాణం కోల్పోయాడు.. జనగామ పట్టణం మైనార్టీ కాలనీలో గత 30 సంవత్సరాలుగా కిరాయికి ఉంటున్న ఎండి గౌస్ పాషా గుండెపోటుతో మృతిచెందాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. పాషా 30 ఏండ్లుగా అద్దె ఇంట్లోనే ఉంటున్నాడు. గతంలో బాణాపురంలో ఇందిరమ్మ ఇల్లు, స్థలం కోసం.. ప్రస్తుతం డబుల్ బెడ్ కోసం పోరాడాడు. ఇండ్ల సాధన పోరాటంలో ప్రధాన పాత్ర పోషించాడు. ఇన్నేండ్లయినా తమకు ఇల్లు మంజూరవుతుందో లేదోనని తీవ్ర మానసిక వేదనకు గురయ్యాడు. ఈ క్రమంలో శనివారం తెల్లవారుజామున ఛాతిలో నొప్పి వస్తుందని చెప్పడంతో కుటుంబీలకు స్థానిక ఏరియా ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మరణించాడు. విషయం తెలిసిన సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు బూడిది గోపి, పట్టణ కార్యదర్శి జోగు ప్రకాష్, ఇందిరమ్మ డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల సాధన కమిటీ అధ్యక్షులు కళ్యాణం లింగం, నాయకులు, కార్యకర్తలు మైనార్టీ కాలనీలోని వారి ఇంటికి వెళ్లి పాషా భార్య ఫాతిమాను, కుటుంబ సభ్యులను పరామర్శించారు..

మెడికల్ కాలేజీకి ఎన్‌ఎంసి అనుమతి

- సిఎంకు మంత్రి కెటిఆర్ ధన్యవాదాలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని మెడికల్ కాలేజీలో ప్రస్తుత సంవత్సరం నుంచి అడ్మిషన్లకు అనుమతి లభించనుంది. ఈ నేపథ్యంలో ఆ జిల్లా నుంచి ప్రాతినిథ్యం వహిస్తున్న మంత్రి కె.తారక రామారావు జిల్లా ప్రజల తరపున సిఎం కెసిఆర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ముఖ్యమంత్రి ఆధ్వర్యంలో జిల్లాకో వైద్య కళాశాలను ఏర్పాటు చేయాలన్న లక్ష్యంలో భాగంగా రాజన్న సిరిసిల్ల జిల్లాకు మెడికల్ కాలేజ్‌ని కేటాయించడంతోపాటు దానికి అవసరమైన అన్ని రకాల సహాయ సహకారాలు అందిస్తున్న నేపథ్యంలో ప్రజలు ఎల్లప్పుడూ రుణపడి ఉంటారని కెటిఆర్ ఈ సందర్భంగా తెలియజేశారు. తాజాగా సిరిసిల్ల మెడికల్ కాలేజీలో ప్రస్తుత విద్యా సంవత్సరం నుంచి ప్రవేశాలను చేపట్టేందుకు నేషనల్ మెడికల్ కమిషన్ ఫర్ మెడికల్ అసెస్మెంట్ అండ్ రేటింగ్ బోర్డ్ అనుమతినిచ్చింది. ఇందులో భాగంగా రాజన్న సిరిసిల్ల జిల్లాలో కాళోజీ నారాయణరావు హెల్త్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో మెడికల్ కాలేజ్‌ను ప్రారంభించి, 100 ఎంబిబిఎస్ సీట్లకు అడ్మిషన్లను స్వీకరించనున్నారు. ఈ మేరకు జాతీయ మెడికల్ కమిషన్ జిల్లా మెడికల్ కాలేజీకి అనుమతిస్తూ ధ్రువీకరణ పత్రాన్ని జారీ చేసింది.

హరీశ్ రావు హర్షం

వంద ఎంబిబిఎస్ సీట్లతో రాజన్న సిరిసిల్లా జిల్లాలో మెడికల్ కాలేజీ ఏర్పాటుకు అనుమతి రావడం పట్ల వైద్యారోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు శనివారం ఆయన ట్వీట్ చేశారు. తొమ్మిది మెడికల్ కాలేజీలకుగాను ఇప్పటి వరకు ఏడింటికీ అనుమతి వచ్చినట్టు ఆయన తెలిపారు. 24 ప్రభుత్వ మెడికల్ కాలేజీలతో జిల్లాకో మెడికల్ కాలేజీ ఏర్పాటు చేయాలన్న సీఎం కేసీఆర్ లక్ష్యం విజయవంతంగా ముందుకెళ్తున్నదని పేర్కొన్నారు.

కొటాక్ పుల్లెల గోపీచంద్ బ్యాడ్మింటన్ అకాడమీ ప్రారంభం

హైదరాబాద్ : కొటాక్ మహీంద్రా బ్యాంక్ కార్పొరేట్ సామాజిక బాధ్యత (సిఎస్‌ఆర్)లో భాగంగా పుల్లెల గోపిచంద్ బాడ్మింటన్ ఫౌండేషన్‌తో జట్టు కట్టింది. ఇందులో భాగంగా గచ్చిబౌలిలో ప్రపంచ స్థాయి 'కొటాక్ పుల్లెల గోపిచంద్ బాడ్మింటన్ అకాడమీ'ని ప్రారంభించింది. శనివారం జరిగిన ఈ కార్యక్రమంలో ఆ ట్రస్టీ ఫౌండర్ పుల్లెల గోపిచంద్, ట్రస్టీ, కొటాక్ మహీంద్రా బ్యాంక్‌కు చెందిన శాంతి ఏకాంబరం, సిఎఫ్‌ఒ జైమిన్ భట్ పాల్గొన్నారు. ఈ కొత్త శిక్షణా సౌకర్యాన్ని ప్రారంభించడం రెండు సంస్థలకు ఒక ముఖ్యమైన మైలురాయి. దేశంలో అసాధారణమైన అథ్లెట్లు మరియు కోచ్‌లను అభివద్ధి చేయాలనే వారి భాగస్వామ్య దృష్టిని సాధించే దిశగా ముందుకు వెళ్తామని వారు తెలిపారు.

'కిభో' బెదిరింపు..!

- వైట్ పేపర్ విడుదల.. అంతలోనే అసమగ్రమని సమాచారం
- మానుకోట ఎస్‌పికి ఫిర్యాదు చేసిన బాధితులకు బెదిరింపు ఫోన్ కాల్స్
- క్రిప్టో బిజినెస్‌కు ఆటంకంగా మారారంటూ బాధితులపైనే కౌంటర్ ఫిర్యాదు
- రాష్ట్రంలో సూపర్ సిఇఒల దందా

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఫేక్ క్రిప్టో కరెన్సీ పేరుతో దందాకు పాల్పడుతున్న 'కిభో'పై మీడియాలో వచ్చిన కథనాలు బాధితుల్లో కొండంత ధైర్యాన్ని నింపాయి. దాంతో వారు అదేరోజు (గత సోమవారం) మానుకోట జిల్లా ఎస్‌పి శరత్‌చంద్ర పవార్‌కు ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన ఎస్‌పి అక్కడి సిసిఎస్ పోలీసులకు కేసు అప్పగించారు. ఈ విచారణ కొనసాగుతుండగానే ఎస్‌పికి ఫిర్యాదు చేసిన బాధితులు భాస్కర్‌రావు, నాగరాజుపై కంపెనీ సూపర్ సిఇఒ వేంపల్లికృష్ణ కేసు పెట్టాడు. క్రిప్టో కరెన్సీ బిజినెస్ చేస్తున్న తమపై బెదిరింపులకు పాల్పడుతున్నారని ఫిర్యాదు చేయడంతో 'దొంగే దొంగ' అని అరిచినట్టు ఉందని బాధితులు అంటున్నారు. ఇకపోతే కిభో బాధితుల్లో ప్రభుత్వ, ప్రయివేట్ ఉద్యోగులే అధికంగా ఉన్నట్టు సమాచారం. వీరిలో ఖమ్మం పోలీసు కమిషనరేట్ పరిధిలో పనిచేస్తున్న కొందరు ఉద్యోగులు సైతం ఉన్నట్టు తెలుస్తోంది. కిభో వ్యవస్థాపక అధినేత కిలపర్తి వెంకట్రావు ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్టణంలో ఉంటున్నట్టు సమాచారం అందుకున్న బాధితులు అనేకులు అక్కడికి కూడా వెళ్లి విచారించారు. కానీ ఎక్కడా ఆ కంపెనీ పేరుతో కార్యాలయం లేకపోవడం గమనార్హం.

మీడియాలో వార్తల నేపథ్యంలో మే 23న రిలీజ్ చేయాల్సిన ఎక్స్ఛేంజ్‌ను దాదాపు నెలరోజుల ముందుగానే.. అంటే, కథనం వెలువడిన మరుసటి రోజే ఏప్రిల్ 18నే సంస్థ అధినేత రిలీజ్ చేశాడు. ఏప్రిల్ 21న శుక్రవారం వైట్‌పేపర్ సైతం వెలువడింది. కొద్దిసేపటికే అది అసమగ్రంగా ఉందని.. సమగ్ర సమాచారంతో వచ్చేనెల 23న రిలీజ్ చేస్తానని ప్రకటించాడు. ఇక సిఇఒలు, సూపర్ సిఇఒల అకౌంట్లలో నాన్‌స్టేకబుల్ కాయిన్స్ భారీగా జమవుతున్నాయని తెలుస్తోంది.

COIN LOGO

తెలంగాణలో సూపర్ సిఇఒల దందా..!

సిఇఒలు, సూపర్ సిఇఒలుగా చెలామణి అవుతున్న వారు ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలకు చెందిన పలువురు ప్రజల నుంచి రూ.కోట్లను కంపెనీకి దోచిపెట్టినట్టు సమాచారం. మణుగూరు నుంచి చింతల రాజు, ఇల్లెందు రొంపేడు పరిసర వాసి వేంపల్లి కృష్ణ, ముదిగొండ నుంచి కన్నోజు ఉపేందర్ సూపర్ సిఇఒలుగా కంపెనీకి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. వారి కింద కల్తీ ప్రవీణ్‌రాజు, అంబోజి కిరణ్, కర్నె మోహన్‌రావు తదితరులు సూపర్ సిఇఒలుగా పనిచేస్తున్నారని తెలుస్తోంది. వీరంతా కంపెనీకి రూ.కోట్లలో దోచిపెడుతున్నారనే అభియోగం ఉంది. కిభో కంపెనీ అధినేత తెలంగాణ, ఏపీ, ఒడిశా, ఛత్తీస్‌గఢ్ తదితర రాష్ట్రాల్లో బాగా పనిచేసి వేలు, లక్షల సంఖ్యలో రూ.500 కట్టించిన 34 మందిని సిఇఒలుగా ఎంపిక చేశాడు. ఆ తర్వాత ఇలానే చేర్పించిన 270 మందిని సిఇఒలుగా నియమించి, తొలుత ఎంపికైన 34 మందికి సూపర్ సిఇఒగా ఉన్నతి కల్పించాడు. వీరు కూలీలను సైతం వదలకుండా ఒక్కొక్కరు లక్ష మంది చేత రూ.500 చొప్పున కట్టించారు. అలా కంపెనీకి రూ.2,500 కోట్ల ఆదాయం లభించింది. అయితే, వీరి ఎంపికలో ఎటువంటి ప్రమాణాలూ పాటించినట్టు లేదు. కేవలం అత్యధికులను కిభోలో జాయిన్ చేయించడమే ప్రాతిపదికగా వీరి ఎంపిక జరిగినట్టు తెలుస్తోంది.

కార్ విన్నరైతే సీఈవో పోస్టు..!

సిఇఒలు, సూపర్ సిఇఒలుగా ఎంపిక కావాలంటే వెయ్యి నుంచి 1584 పాయింట్లు లేదా సభ్యులను కలిగి ఉండాలి. పాయింట్ల ఆధారంగా వివిధ బహుమతుల విన్నర్లను ప్రకటిస్తారు. 1584 పాయింట్లు పొందిన వారిని కార్ విన్నర్‌గా ప్రకటించడంతో పాటు సిఇఒ, సూపర్ సిఇఒగా కంపెనీ ప్రకటిస్తోంది. ఈ నేపథ్యంలో పలువురు ఒక్కరితోనే రూ.7,92,000 కట్టించి కార్ విన్ చేయించి నేరుగా సిఇఒలు అయ్యారు.

కిభో అడ్రస్ లేదు.. ఐడెంటిటీ లేదు..!

సూపర్ సిఇఒలు, సిఇఒలుగా ఎంపికైన వారికి కంపెనీ తన చిరునామాతో ఎలాంటి ఐడెంటిటీ కార్డులు కానీ, నియామక పత్రాలు కానీ ఇచ్చింది లేదు. ఎలాంటి అధికార పత్రాలూ లేకుండానే అధినేత, సూపర్ సిఇఒలు, సిఇఒలు మోసానికి తెగబడ్డారని బాధితులు ఆరోపిస్తున్నారు. కిభో పేరుతో క్రిప్టో మాటున జరిగిన రూ.2,500 కోట్ల దందాను నిలువరించి ప్రజలను ఆర్థిక దోపిడీ నుంచి కాపాడాలని పలువురు బాధితులు కోరుతున్నారు. తమ పేర్లు బయటకు రాకుండా ఫేక్ క్రిప్టో కరెన్సీ పేరిట జరుగుతున్న మోసాన్ని చేరవేయాలని బాధితులు వేడుకుంటున్నారు.

దొంగను పట్టుకున్న మహిళా కమిషన్ చైర్‌పర్సన్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఆటోలో ప్రయాణిస్తున్న మహిళను డ్రైవర్ కత్తితో బెదిరించి మెడలోని పుస్తెలతాడును చోరీ చేసి పారిపోతుండగా.. రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ పట్టుకున్నారు. ఈ ఘటన సంగారెడ్డి జిల్లా నర్సాపూర్‌లో శనివారం జరిగింది. ఇందుకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..

సంగారెడ్డి జిల్లా జోగిపేట సమీపంలోని సంఘపేట గ్రామానికి చెందిన ఊరడి సురేష్ ఆటో నడుపుతాడు. శనివారం తన ఆటోలో తన భార్య స్వప్నతో కలిసి నర్సాపూర్ వస్తున్నాడు. ఇస్మాయిల్‌ఖాన్‌పేట్ స్టేజ్ వద్ద అమృత అనే మహిళ నర్సాపూర్ వెళ్లేందుకు సురేష్ ఆటో ఎక్కింది. నర్సాపూర్ మండలం ఆవంచ గ్రామ స్టేజీ సమీపంలోకి రాగానే సురేష్ ఆటోను పక్కకు ఆపాడు. తన ఆటోలో ఉన్న అమృతను కత్తితో బెదిరించాడు. చంపుతానంటూ భయపెట్టి ఆమె మెడలో ఉన్న పుస్తెలతాడును తెంపుకుని ఆమెను వదిలేసి పరారయ్యాడు. అమృత గట్టిగా కేకలు వేయడంతో అదే సమయంలో ఆ దారిలో ప్రయాణిస్తున్న రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ సునీతాలక్ష్మారెడ్డి చూశారు. దాంతో చైర్‌పర్సన్ తన భద్రతా సిబ్బందికి చెప్పి పారిపోతున్న ఆటో డ్రైవర్ సురేష్‌ను పట్టుకోవాలని సూచించారు. భద్రతా సిబ్బంది వెంబడించి సురేష్‌ను పట్టుకున్నారు. జరిగిన సంఘటన గురించి స్థానిక పోలీసులకు ఫోన్ చేసి సమాచారం ఇచ్చారు. చోరీకి పాల్పడిన సురేష్‌తో పాటు అతని భార్య స్వప్నను పోలీస్ స్టేషన్‌లో అప్పజెప్పారు. నిందితులపై కేసు దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

మెదక్ ఆర్డినెన్స్ ఫ్యాక్టరీని ప్రయివేటీకరించొద్దు

- కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌కు మంత్రి హరీశ్‌రావు లేఖ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

దేశ రక్షణ రంగంలో కీలక పాత్ర పోషిస్తున్న మెదక్ సహా ఇతర ఆర్డినెన్స్ ఫ్యాక్టరీలను ప్రయివేటుపరం చేయొద్దని రాష్ట్ర ఆర్థిక, వైద్యారోగ్య శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. దేశ భద్రత, 74 వేల మంది ఉద్యోగులను దృష్టిలో ఉంచుకొని వెంటనే నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని ఆయన కోరారు. ఈ మేరకు శనివారం కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌కు హరీశ్ రావు లేఖ రాశారు. "డిఫెన్స్ రంగంలో ఉన్న ఏడు ప్రభుత్వ రంగ సంస్థలను ప్రయివేటీకరించడం ద్వారా ఆయా సంస్థల మధ్య పోటీ నెలకొంటుంది. దీంతో నూతన ఆయుధాల అభివృద్ధి నిలిచిపోతుంది. ఇది మేకిన్ ఇండియా స్ఫూర్తిని దెబ్బతీస్తుంది. మెదక్‌లోని ఆర్డినెన్స్ ఫ్యాక్టరీకి, సిబ్బందికి గత ఆర్థిక సంవత్సరంలో కావాల్సినంత పని ఉండేది. దాదాపు రూ.930 కోట్ల ఆర్డర్లను సమయానికి పూర్తి చేశారు. సంస్థ సిబ్బంది ఎలాంటి సవాళ్లనైనా స్వీకరించేందుకు సిద్ధంగా ఉన్నారు. కానీ ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో సంస్థకు పెద్దగా పని అప్పగించలేదు. దీన్ని సాకుగా చూపి ఆర్డినెన్స్ ఫ్యాక్టరీని "సిక్ ఇండస్ట్రీ"గా ప్రకటిస్తారని కార్మికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇదే జరిగితే ప్రత్యక్షంగా 2,500 మంది ఉద్యోగులు, పరోక్షంగా 5 వేల మంది ఉపాధి దెబ్బతింటుంది. మొత్తంగా సుమారు 25 వేల మంది భవిష్యత్తు అంధకారంలో పడుతుంది" అని మంత్రి ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో "ఆయుధ కర్మాగార తెలంగాణ ఉద్యోగుల సమాఖ్య" ప్రతినిధులు తనకు ప్రయివేటేజేషన్‌ను అడ్డుకోవాలంటూ తనను కలిసి విజ్ఞప్తి చేశారని మంత్రి పేర్కొన్నారు. మూడు రైతు చట్టాల మాదిరిగానే డిఫెన్స్ రంగ సంస్థల ప్రయివేటీకరణ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలనీ, పరిశోధనల విభాగాన్ని మరింత పటిష్టం చేయాలని ఆయన ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. మిషనరీని ఆధునికరించడం ద్వారా ఉద్యోగులకు నైపుణ్య శిక్షణ ఇవ్వాలని ఆయన కోరారు. పరిపాలన, కొనుగోలు విధానాలను సరళీకరించాలనీ, ఆర్మీ అవసరాలకు అనుగుణంగా ఆర్డినెన్స్ ఫ్యాక్టరీకి ఆర్డర్లు ఇవ్వాలని కోరారు. ప్రసార భారతిలో మాదిరిగానే ఉద్యోగులకు భద్రత కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ఆర్డినెన్స్ ఫ్యాక్టరీల విషయంలో కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

ప్రపంచ ఏఐ షోకు కెటిఆర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి తారకరామారావుకి మరో ప్రతిష్టాత్మక అంతర్జాతీయ ఆహ్వానం లభించింది. దుబాయ్‌లో జరిగే ప్రపంచ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ)షోకు ముఖ్యఅతిథిగా హాజరుకావాలని నిర్వాహకులు ఆయన్ను ఆహ్వానించారు. జూన్ 7, 8వ తేదీల్లో దుబాయ్‌లోని జుమేరా ఎమిరేట్స్ టవర్‌లో ఈ ప్రదర్శన జరగనుంది. మంత్రి కెటిఆర్ సారథ్యంలో తెలంగాణ ఐటీ, ఐటీ అనుబంధ రంగాల్లో అద్భుతమైన పురోగతి సాధించిందని, ఇలాంటి నాయకులు తమ సమావేశంలో పాల్గొనడం వల్ల దానికి ఎంతో విలువ చేకూరుతుందని నిర్వాహకులు తమ ఆహ్వానంలో పేర్కొన్నారు. దుబాయిలో జరిగే ఈ సమావేశంలో ప్రభుత్వ ప్రతినిధులతో పాటు ఆరోగ్యరంగం, రిటైల్ రంగం, మ్యానుఫ్యాక్చరింగ్, బ్యాంకింగ్ ఫైనాన్స్, రియల్ ఎస్టేట్, రవాణా వంటి అనేక రంగాలకు చెందిన కంపెనీల ప్రతినిధులూ ఆ సమావేశంలో పాల్గొనున్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ రంగంలో ఇప్పటికే విజయవంతమైన అనుభవాలను, వాటి ఫలితాలను ఈ సమావేశంలో ప్రదర్శిస్తారు. దుబాయ్‌కి అత్యంత కీలకమైన ఈ రంగాల్లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ద్వారా కలిగే ప్రయోజనాలను ప్రాథమికంగా చర్చించడంతోపాటు, వివిధ దేశాల నుంచి పాల్గొంటున్న ప్రతినిధులు తమ అనుభవాలను వివరిస్తారని నిర్వాహకులు తెలిపారు. కెటిఆర్ హాజరు కావడమనేది దుబాయ్‌లో ఉన్న భారతదేశ, ముఖ్యంగా తెలుగు ప్రవాస భారతీయ టెక్నాలజీ రంగ నిపుణులకు ఎంతో స్ఫూర్తినిస్తుందని తెలిపారు. తెలంగాణ అనుభవాల నుంచి విదేశాలతో పాటు ముఖ్యంగా మిడిల్ ఈస్ట్, ఆఫ్రికన్ రీజియన్ వంటి ప్రాంతాల నుంచి వస్తున్న ప్రతినిధులు స్ఫూర్తి పొందేందుకు అవకాశం ఉందని తెలిపారు. ఆ కార్యక్రమంలో భాగంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ విభాగంలో అద్భుతమైన ఫలితాలు సాధించిన సంస్థలకు, వ్యక్తులకు అవార్డులు ప్రదానం చేయనున్నారు.

విఒఎల సమస్యలు పరిష్కరించే వరకూ పోరు

సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షులు ఎస్‌వి.రమ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

విఒఎల సమస్యలు పరిష్కరించే వరకూ పోరాడుతామని తెలంగాణ ఐకెపి విఒఎల సంఘం (సిఐటియు) రాష్ట్ర గౌరవ అధ్యక్షులు ఎస్‌వి.రమ అన్నారు. తమ సమస్యల పరిష్కారం కోసం వారం రోజులుగా విఒఎలు చేస్తున్న సమ్మె కొనసాగుతోంది. శనివారం రంగారెడ్డి జిల్లా కందుకూరు, తలకొండపల్లి మండల కేంద్రాల్లో కొనసాగుతున్న విఒఎల నిరవధిక సమ్మెకు రమ మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. చాలీచాలని వేతనాలతో విఒఎలు పనిచేస్తున్నారన్నారు. కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. విఒఎలకు సిఐటియు రాష్ట్ర కమిటీ పూర్తిగా మద్దతు ప్రకటిస్తుందన్నారు. గ్రామ స్థాయిలో 19 ఏండ్లుగా పనిచేస్తున్న విఒఎలను ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. వీవోఏలలో ఎక్కువ మంది మహిళలే ఉన్నారన్నారు. మహిళల సమస్యలను దృష్టిలో పెట్టుకునైనా వారి సమస్యలు పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా శ్రామిక మహిళా కన్వీనర్ జి.కవిత, సీఐటీయూ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు అలువాల రవికుమార్, సిఐటియు మహేశ్వరం మండల కన్వీనర్ ఏర్పుల శేఖర్, కందుకూరు మండల కన్వీనర్ బుట్టి బాలరాజు, శివలీలా, సరస్వతి, సంగీత, లక్ష్మి, పద్మ, రామచంద్రారెడ్డి, రమేష్, రవి, వీవోఏలు పాల్గొన్నారు.

నా చావుకు కారణం సిఐనే..

రియల్ ఎస్టేట్ వ్యాపారి సూసైడ్ నోట్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

భూమి విషయంలో డబ్బులు కట్టాలని సెంట్రల్ ఇంటెలిజెన్స్ సిఐ ఒత్తిడి, వేధింపులు భరించలేకపోతున్నా.. 'నా చావుకు కారణం సీఐ గోపిసార్' అని సూసైడ్ నోట్ రాసిపెట్టి ఓ రియల్ ఎస్టేట్ వ్యాపారి ఆత్మహత్య చేసుకున్నారు. ఈ సంఘటన కరీంనగర్ జిల్లా చొప్పదండి మండలం భూపాలపట్నం గ్రామంలో శుక్రవారం రాత్రి జరిగింది. చొప్పదండి ఎస్ఐ ఉపేంద్రచారి తెలిపిన వివరాల ప్రకారం.. కరీంనగర్ జిల్లా చొప్పదండి మండలం భూపాలపట్నం గ్రామానికి చెందిన బొడిగె శ్యామ్ అలియాస్ సాంబయ్య (55) జిల్లా కేంద్రంలోని విద్యారణ్యపురిలో నివాసం ఉంటూ రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నారు. పది నెలల కిందట కరీంనగర్‌కు చెందిన సెంట్రల్ ఇంటెలిజెన్స్ బ్యూరో సిఐ గోపాలకృష్ణకు చొప్పదండి మండలం భూపాలపట్నం గ్రామ శివారులో 20 గుంటల భూమి గుంటకు రూ.2 లక్షల 50 వేల చొప్పున రూ.50 లక్షలకు శ్యామ్ ఇప్పించాడు. ఆ తర్వాత ఆ భూమిని అమ్మి పెట్టాలని శ్యామ్‌కు చెప్పాడు. 5 నెలల్లో భూమిని అమ్మి రూ.10 లక్షల లాభం ఇప్పిస్తానని శ్యామ్.. సిఐకి మాట ఇచ్చాడు. కానీ ఆ భూమి సమయానికి అమ్మలేకపోవడంతో.. నువ్వే ఉంచుకొని రూ.10 లక్షలు కలిపి డబ్బులు ఇవ్వాలని శ్యామ్‌ను సిఐ వేధించడం మొదలుపెట్టాడు. శ్యామ్ ఇచ్చిన మాటకు కట్టుబడి రూ.6 లక్షలు సీఐ గోపాలకృష్ణకు చెల్లించాడు. మిగతా డబ్బులు ఈ నెల 15న కట్టడానికి వాయిదా ఉండగా.. డబ్బులు సర్దుబాటు కాలేదని సీఐని శ్యామ్ బతిమిలాడినా వినకుండా బెదిరిస్తూ మానసికంగా వేధించాడు. ఈ క్రమంలో ఆయన ఆత్మహత్య చేసుకున్నారు.

కాయకష్టం.. వర్షంపాలు

- తడిసి ముద్దయిన ధాన్యం
- తూకం నెమ్మదిగా కొనసాగుతుందని ఆరోపణ
- ప్రభుత్వం ఆదుకోవాలని వేడుకోలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కాయ కష్టం చేసి పంట పండితే.. కండ్ల ముందే వర్షం పాలైంది. అకాల వర్షం, ఈదురు గాలులు రైతులను నట్టేట ముంచాయి. తడిసిన ధాన్యాన్ని ఆరబెట్టేందుకు అవకాశాలూ లేకపోవడంతో అన్నదాతలు అవస్థ పడుతున్నారు. కనీసం టార్పాలిన్లు వేసైనా కాపాడాల్సిన అధికారులు పత్తాలేరు. రాష్ట్ర ప్రభుత్వం ఈసారి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆలస్యంగా ప్రారంభించడమూ పంట తడవడానికి కారణమైంది.

ఏప్రిల్ ఒకటో తేదీన కొనుగోలు కేంద్రాలను ప్రారంభిస్తామని చెప్పినా ఆలస్యంగా 10వ తేదీన ప్రారంభించారు. శుక్రవారం కురిసిన అకాలవర్షానికి కొనుగోలు కేంద్రాల్లో ఆరబోసిన ధాన్యం తడిసి ముద్దయింది. కొనుగోలు కేంద్రాల్లో దాన్యం కాంటాలు నెమ్మదిగా కొనసాగుతున్నాయని, ముందస్తు చర్యలు తీసుకోకపోవడం వల్లే ఇలా అయిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గన్నీ బ్యాగుల, లారీల కొరతతో ఇబ్బంది ఉంది. వాతావరణ పరిస్థితుల దృష్ట్యా కొనుగోలులో వేగం పెంచేలా అధికారులు చర్యలు చేపట్టాలని రైతులు వేడుకుంటున్నారు.

నల్లగొండ జిల్లాలో ఐకేపీ138, పీఏసీఎస్ ఆధ్వర్యంలో 140 మొత్తం 278 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. వీటిలో 268 కేంద్రాలు ఇప్పటికే ప్రారంభమయ్యాయి. నేటికీ 60,2508 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయగా.. 3408 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ఉంది. కొనుగోళ్లు మందకొడిగా సాగుతున్నాయి. పలు రకాల కారణాలను చూపుతూ ధాన్యాన్ని కొనుగోలు చేయడంలో ఆలస్యం చేస్తున్నారు. అధికారులు సరైన ఏర్పాట్లు చేయకపోవడం, దళారుల నియంత్రణలో చర్యలు లేకపోవడంతో రైతులు తక్కువ ధరకే ధాన్యాన్ని విక్రయించాల్సి వస్తుంది.

ధాన్యం కొనుగోలు సక్రమంగా జరిగేలా చర్యలు తీసుకోవడంలో విఫలమవుతున్నారన్న ఆరోపణలు వస్తున్నాయి. ఓ వైపు తూకంలో నష్టం చేస్తుండగా.. మరోవైపు మిల్లర్లు కోతను విధిస్తున్నారు. ఇదేమని ప్రశ్నించిన రైతుల ధాన్యాన్ని కొనుగోలు చేయకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారు. లారీల యజమానులు కృత్రిమ కొరత సృష్టిస్తున్నారు. బస్తాకు నిర్ణయించిన ధరను చెల్లిస్తే రవాణా చేస్తామని బహిర్గతంగా చెబుతున్నారు. ఇంత తతంగం జరుగుతున్నా అధికారులు పట్టనట్టు వ్యవహరించడం ఏంటని రైతులు ప్రశ్నిస్తున్నారు. దాంతో చేసేదేమీ లేక లారీ యజమానులు బస్తాకు నిర్ణయించిన రెండు నుంచి మూడు రూపాయలను చెల్లించి రవాణా చేయించుకోవలసిన దుస్థితి నెలకొంది. నాంపల్లిలో ఏర్పాటు చేసిన పీఏసీఎస్ కొనుగోలు కేంద్రంలో తేమశాతం తక్కువగా ఉందని సాకు చూపుతూ ధాన్యాన్ని కొనుగోలు చేయడం లేదంటూ రైతులు శుక్రవారం ఆందోళనకు దిగారు. తడిసిన ధాన్యాన్ని పూర్తిగా కొనుగోలు చేసి ప్రకటించిన మద్దతు ధరను చెల్లించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని, ఇప్పటికైనా అధికారులు కొనుగోలులో వేగం పెంచాలని రైతులు వేడుకుంటున్నారు. నల్లగొండ జిల్లా వ్యాప్తంగా శుక్రవారం 300.3 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదయింది. అత్యధికంగా నకిరేకల్ మండలంలో 46.2, పీఏపల్లిలో 0.1 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదయింది.

తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలి

జిల్లావ్యాప్తంగా కొనుగోలు కేంద్రాలకు వచ్చిన ధాన్యాన్ని ప్రభుత్వమే బాధ్యత వహిస్తూ కొనుగోలు చేయాలి. తడిసిన, రంగు మారిన, మొలకెత్తిన ధాన్యానికి ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకే కొనుగోలు చేయాలి.

బండా శ్రీశైలం - రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు

స్కూళ్లకు నాణ్యత లేని బియ్యం సరఫరా

పౌరుగుసేవల ఉద్యోగులపై వేటు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

హాస్టళ్లు, స్కూళ్లకు నాణ్యత లేని బియ్యం సరఫరాపై సర్కారు సీరియస్ అయింది. ఈ మేరకు బాధ్యులుగా గుర్తించిన ఎనిమిది పౌరుగుసేవల సిబ్బందిని తొలగించింది. అదే సమయంలో సరఫరా చేసిన నాణ్యత లేని బియ్యాన్ని వెనక్కి తీసుకుని వాటి స్థానంలో సన్నబియ్యాన్ని 45 రోజుల్లో అందజేయాలని ఆదేశించింది. పలు ఫిర్యాదుల నేపథ్యంలో శనివారం పౌరసరఫరా సంస్థ చైర్మన్ రవీందర్ సింగ్ 96 మంది టెక్నికల్ అసిస్టెంట్లు, భారత ఆహార సంస్థ రిటైర్డ్ ఉద్యోగులతో సన్నబియ్యంపై హైదరాబాద్‌లో సమీక్షా సమావేశం నిర్వహించారు. కొంత మంది అమానవీయంగా స్కూళ్లకు, హాస్టళ్లకు నాణ్యత లేని బియ్యం సరఫరా చేసినట్టు ఆయన ఈ సందర్భంగా తెలిపారు. ఎనిమిది జిల్లాలకు చెందిన మిల్లర్లు నిర్దేశించిన గడువులోగా బియ్యాన్ని మార్చాలని ఆదేశించారు. ఉద్యోగులు, మిల్లర్లు తమ విధులను జాగ్రత్తగా నిర్వహించాలనీ, వారిపై నిఘా ఉంటుందని హెచ్చరించారు. ఎలాంటి ఒత్తిడి, ప్రభావానికి గురి కాకుండా బాధ్యులపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలు, సాంఘిక సంక్షేమ వసతి గృహాల్లో ఉండే పేద విద్యార్థులు పౌష్టికాహార లోపం, రక్తహీనతకు గురి కాకుండా బలవర్ధకమైన సన్నబియ్యం సరఫరా చేయాలనేది సిఎం లక్ష్యమని తెలిపారు. విద్యార్థుల్లో పౌష్టికాహార లోపాన్ని నివారించేందుకు వీలుగా ప్రభుత్వం ఏడాదికి 65 వేల మెట్రిక్ టన్నుల సన్న బియ్యాన్ని సేకరిస్తున్నదని ఆయన తెలిపారు.

హమాలీలకు వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు

ఆల్ హమాలీ ఫెడరేషన్ డిమాండ్

29న చలో హైదరాబాద్‌ను జయప్రదం చేయండి

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

హమాలీలకు వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేసి, సంక్షేమ పథకాలను అమలు చేయాలని, 55 ఏళ్ల వయస్సుపైబడిన హమాలీలకు నెలకు రూ.6 వేల పెన్షన్ ఇవ్వాలని తెలంగాణ ఆల్ హమాలీ ఫెడరేషన్ (సిఐటియు) రాష్ట్ర కార్యదర్శి యాటాల సోమన్న డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లోని మలక్‌పేట్ మార్కెట్ హమాలీ వర్కర్స్ సమావేశం సిఐటియు నాయకులు శ్రావణ్‌కుమార్ అధ్యక్షతన శనివారం జరిగింది. ఈ సందర్భంగా సోమన్న మాట్లాడుతూ ప్రభుత్వ గోదాముల్లో పని చేస్తున్న సివిల్ సప్లైస్, జిసిసి, బేవరేజెస్, ఎఫ్‌సిఐ హమాలీలను 4వ తరగతి ఉద్యోగులుగా గుర్తించాలని, ఐఎల్ఒ తీర్మానం ప్రకారం 50 కిలోల బరువులను నిషేధించాలని అన్నారు. హమాలీలందరికీ ఉద్యోగ భద్రత, కనీస వేతనాలు, పిఎఫ్, ఇఎస్ఐ వంటి చట్టబద్ధ హక్కుల అమలు, ఐకెపి హమాలీలకు ప్రభుత్వమే బిల్లులు చెల్లించాలని చెప్పారు. హమాలీల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 29న 'చలో హైదరాబాద్' లేబర్ కమిషనర్ కార్యాలయం వద్ద జరిగే ధర్నాలో హమాలీలు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని ఆయన కోరారు. హమాలీల రక్షణ కోసం సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేయాలనే డిమాండ్లపై నిర్వహిస్తున్న 'చలో హైదరాబాద్' కార్యక్రమంలో హమాలీలంతా పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. నాయకులు జి.నరసింహ, గోపాల్, వెంకటేశ్, చిన్న, జి.ఆంజనేయులు పాల్గొన్నారు.

కెసిఆర్‌తో ఎలాంటి లాలూచీ లేదు

- భాగ్యలక్ష్మి అమ్మవారి ఆలయం వద్ద ప్రమాణం చేసి చెప్తున్నా..
- మునుగోడు ఉప ఎన్నికల్లో ఏం జరిగిందో అందరికీ తెలుసు
- ఆధారాలు లేకుండా ఈటల ఎలా ఆరోపణలు చేస్తారు?
- టిపిసిసి అధ్యక్షులు రేవంత్ రెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

"కెసిఆర్‌తో నాకు ఎలాంటి లాలూచీ లేదు.. భాగ్యలక్ష్మి అమ్మవారి ఆలయం వద్ద ప్రమాణం చేసి చెప్తున్నా.. మునుగోడు ఉప ఎన్నికల్లో ఏం జరిగిందో అందరికీ తెలుసు.. ఆధారాలు లేకుండా మాజీ మంత్రి ఈటల రాజేందర్ ఎలా ఆరోపణలు చేస్తారు..?" అని కాంగ్రెస్ పిసిసి అధ్యక్షులు రేవంత్ రెడ్డి అన్నారు. మునుగోడు ఎన్నికల్లో కాంగ్రెస్‌కు కెసిఆర్ రూ.25 కోట్లు ఇచ్చారన్న ఈటల ఆరోపణలపై సవాలు విసిరిన రేవంత్ రెడ్డి శనివారం సాయంత్రం చార్మినార్ భాగ్యలక్ష్మి దేవాలయంలో అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. మునుగోడు ఉప ఎన్నికల్లో ఏం జరిగిందో అందరికీ తెలుసు అని, మూడు నెలల్లో మూడు వందల కోట్ల మద్యం ఏరులై పారిందని అన్నారు. ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ నుంచి పోటీ చేసిన అభ్యర్థి పాల్వాయి స్రవంతి ఒక్క రూపాయి ఖర్చు పెట్టకుండా ప్రజా తీర్పు కోరారన్నారు. తమ పార్టీ నాయకులు చందాలు వేసుకొని ప్రచారం చేశారన్నారు. ఆధారాలు లేకుండా ఈటల ఎలా కాంగ్రెస్ పార్టీపై ఆరోపణలు చేస్తున్నారని ప్రశ్నించారు. మునుగోడు ఉప ఎన్నికల్లో బిజెపి ఓటమి తర్వాత ఆ పార్టీలో కుమ్ములాటలు అందరికీ తెలిసిందేనన్నారు. మునుగోడు ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి 25 వేల ఓట్లు వచ్చాయన్నారు. ఈటల రాజేందర్ వ్యవహారశైలి రెండ్రోజులుగా విచిత్రంగా వుందన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత కెసిఆర్ పాలనకు వ్యతిరేకంగా పోరాటం చేస్తున్నామని తెలిపారు. కెటిఆర్ ఫామ్‌హౌస్ నిర్మించుకుంటే వ్యతిరేకించి పోరాటం చేస్తున్న తనను చర్లపల్లి, చంచల్‌గూడ జైలుకు పంపలేదా అని గుర్తు చేశారు. తన మనోధైర్యం దెబ్బతీయాలని ప్రయత్నం చేయలేదా అని ప్రశ్నించారు. హైదరాబాద్ నగరాన్ని కెసిఆర్ ప్రభుత్వం అపార్ట్‌మెంట్స్ పేరు మీద విధ్వంసం చేస్తుంటే నిలబడి కొట్లాడమన్నారు. నేరేళ్ళ ఇసుక దోపిడీపై, మల్లన్నసాగర్ నిర్వాసితుల కోసం, కాళేశ్వరం అవినీతిపై పోరాటం చేశామన్నారు. టిఎస్‌పిఎస్‌సి పేపర్ లీకేజీ అంశంపై 30 లక్షల మంది విద్యార్థులకు అండగా కాంగ్రెస్ ఇడికి ఫిర్యాదు చేసిందన్నారు. తాము తమ జీవితాలను త్యాగం చేసి తెలంగాణ ప్రజల కోసం కొట్లాడుతున్నామన్నారు. అలాంటి తమను ఈటల రాజేందర్ అమ్ముడు పోయారని విమర్శిస్తారా అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. తనను తన పార్టీని, పాల్వాయి గోవర్ధన్ రెడ్డి కుటుంబాన్ని విమర్శించడం సరికాదన్నారు. ఈటల పట్ల తమకు సానుభూతి ఉండేదని.. కానీ తమ నిజాయితీని ఆయన శంకిస్తున్నారా అని ప్రశ్నించారు. బిజెపిలో ప్రాధాన్యత లేకనే తమపై ఆరోపణలు చేస్తున్నారన్నారు. తాను కేసీఆర్‌పై పోరాటం చేస్తుంటే ఈటల మంత్రిగా కేసీఆర్ పక్కన లేరా అని ప్రశ్నించారు. కెసిఆర్ తప్పుల్లో ఈటల భాగస్వామ్యం ఉందా లేదా అనేది ఆయన నిర్ధారించుకోవాలన్నారు. ప్రశ్నించే గొంతును నొక్కాలని ప్రయత్నం చేస్తున్నారన్నారు. కెసిఆర్‌తో ఎట్టి పరిస్థితుల్లో లాలూచీ పడే పరిస్థితి లేదని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపి అంజన్ కుమార్ యాదవ్, అనిల్ కుమార్ యాదవ్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

విద్యలో మూఢత్వం : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సిబిఎస్ఇ పదో తరగతి పాఠ్యాంశాల నుంచి డార్విన్ సిద్ధాంతాన్ని తొలగించడమంటే విద్యలో మూఢత్వాన్ని పెంచడమేనని భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) విమర్శించింది. ఈ మేరకు ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ఆర్ ఎల్ మూర్తి, టి నాగరాజు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. విద్యారంగంపై ఆర్ఎస్ఎస్ డైరెక్షన్‌లో బిజెపి ప్రభుత్వం దాడి చేస్తున్నదని విమర్శించారు. ఇటీవల 12వ తరగతి పాఠాలు తొలగించిన ఎన్‌సిఇఆర్‌టి తీరు ఈ దేశంలో సైన్స్ విద్యకు, దేశ భవిష్యత్తుకు గొడ్డలిపెట్టుగా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు. దేశంలో విద్యను మూఢత్వంలోకి నెట్టి కాషాయీకరణ పెంచే ప్రయత్నం జరుగుతున్నదని విమర్శించారు. జాతీయోద్యమ వీరులు, హిందూ, ముస్లిం ఐక్యతను, గాంధీ హత్యవంటి సబ్జెక్టులు తొలగించడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. డార్విన్ సిద్ధాంతాన్ని తొలగించడం వంటి చర్యల వల్ల సైన్స్ పాఠ్యాంశాలను మళ్లీ పాత పద్ధతిలో విశ్వాసాలు తీసుకొచ్చే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. డార్విన్ పాఠాన్ని పునరుద్ధరణ చేయాలని డిమాండ్ చేశారు. "సైన్స్, చరిత్ర లేకపోతే ఈ దేశానికి భవిష్యత్ లేదు" అని తెలిపారు. ఆర్ఎస్ఎస్ ఈ దేశ చరిత్రను, పాఠ్యాంశాలను మార్చి తన భావజాలాన్ని తీసుకుని రావడాన్ని ప్రజాస్వామిక వాదులు ఖండించాలని కోరారు.

తొలగింపును ఉపసంహరించుకోవాలి : పిడిఎస్‌యు

పదో తరగతి పాఠ్యాంశంలోనుంచి డార్విన్ సిద్ధాంతం తొలగింపును ఉపసంహరించుకోవాలని పిడిఎస్‌యు రాష్ట్ర అధ్యక్షులు పెద్దింటి రామకృష్ణ, కార్యదర్శి నామాల ఆజాద్ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శాస్త్రీయ ఆలోచనలను అణచివేసే కుట్రలో భాగంగానే పాఠ్యాంశాల హేతుబద్ధీకరణ పేరుతో జీవ పరిణామ క్రమం పాఠ్యాంశాన్ని ఎన్‌సిఇఆర్‌టి తొలగించిందని శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నిర్ణయాన్ని తక్షణమే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేదంటే ఆందోళన కార్యక్రమాలను చేపడతామని హెచ్చరించారు.

మధు స్వర మాలిక సినీ గానయాగం

ప్రజాశక్తి - కల్చరల్

వర్ధమాన సాంస్కృతిక సేవా సంస్థ మధు స్వర మాలిక నిర్వహణలో శనివారం శ్రీత్యాగరాయ గాన సభ ప్రధాన వేదిక పై పన్నెండు గంటల నిర్విరామ సినీ గాన యాగం హృద్యంగా జరిగింది. పాటల పోటీలలో విజేత, యువ గాయకుడు ఆదిత్య రంగన్, శ్రీకాంత్, ఉమా మాధవితో కలసి పాడిన యుగళ గీతలు శ్రోతలను రసానందంలో ముంచెత్తాయి. శ్రీనివాసన్ యువ గాయకులు, ఫాల్గుణి,మాధవి, దేవి, తదితరులు ఉదయం 9 ఘంటల నుంచి రాత్రి 9 ఘంటాలవరకు పన్నెండు గంటల గానం యాగంలా చేశారు. ఈ సందర్భంగా ముఖ్య అతిధులుగా అబిడ్ భూషణ్, సంగీత దర్శకుడు సాయి దేవ్ ,నిర్మాతలు నాగేందర్, అనిల్ తదితరులు పాల్గొని ప్రముఖ నాట్య గురువు పద్మా కళ్యాణ్, కీ బోర్డ్ కళాకారుడు బ్రహ్మానందం, వయోధిక గాయకుడు మురళిధరలను సత్కరించారు. జానకీ శృతి కూచిపూడి నాట్యం ఆకట్టుకుంది సంస్థ స్థాపకుడు శ్రీనివాసన్ తమకు సౌజన్యం అందించిన ఆర్.ఆర్.ఆర్.గ్రూప్, ఎన్ఎండిసి వారికి ధన్యవాదాలు తెలిపారు.

గాయకులను అనుకరించటం గొప్ప కళ

ప్రజాశక్తి - కల్చరల్

నేపథ్య గాయకుల గళాలను యథాతథంగా అనుకరించి మెప్పించటం గొప్ప కళ అని అట్టి ప్రతిభావంతుడు రామ సుబ్రహ్మణ్యం అని ప్రముఖులు అభినందించారు. శ్రీ త్యాగరాయ గాన సభ ప్రధాన వేదిక పై శనివారం శ్రీ సరస్వతి కళా పీఠం నిర్వహణలో రామ సుబ్రహ్మణ్యం ధరమ్‌కు సుస్వర రాగ గాన సరస్వతి బిరుదు ప్రదానోత్సవ సభ జంట నగరాల్లోని గాయనీ గాయకుల సమక్షంలో జరిగింది. ప్రముఖసినీ నేపథ్య గాయకుడు సింహ భాగవతులు రామ సుబ్రహ్మణ్యంను సత్కరించి బిరుదు ప్రదానం చేశారు. ప్రముఖ గాయకుడు త్రినాథ రావు, వంశీ సంస్థల అధినేత వంశీ రామ రాజు లు మాట్లాడుతూ జంట నగరాలలో బాలీవుడ్ గాయకులు కిషోర్ కుమార్, రఫీల పాటలు వారి స్వర మాధుర్యంతో పాడగల అతి కొద్ది మంది గాయకుల్లో సుబ్రహ్మణ్యం ప్రధముడని కొని యాడారు. సంస్థ స్థాపకులు ఏం. వీ.జీ.వీ.రావు, రోజా ప్రసన్నతల సారథ్యంలో రామకృష్ణ, అర్చన వెంకటేశ్వర రావు లలిత,మానస, బాంధవి, రత్న కుమారి కొమ్మినేని భవన్నారాయణ, డేవిడ్ రాజు,టి శ్రీనివాస రెడ్డి తమ అభినందనలు తెలిపారు. సినీ పాటల విభావరిలో పాలు పంచు కొన్నారు.

మోడీ వద్ద మార్కులు కొట్టేందుకే ఆరోపణలు

కాంగ్రెస్ నేత అద్దంకి దయాకర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కాంగ్రెస్ బలపడుతుందనే భయం బిజెపి నేతల్లో కనిపిస్తోందని పిసిసి అధికార ప్రతినిధి అద్దంకి దయాకర్ అన్నారు. గాంధీభవన్‌లో శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. విపక్షాలు ఏకమై పోరాడాల్సిన పరిస్థితి నుంచి విచ్ఛిన్నమయ్యే పరిస్థితికి తీసుకొచ్చారని విమర్శించారు. ఈటల వ్యాఖ్యలు అవగాహన లేమితో చేసినవో, లేదా కోపంలో చేసినవో అర్థం కావడం లేదన్నారు. గొప్పలు చెప్పుకొని బిజెపిలో చేరిన ఈటల.. పార్టీలో ఎవరూ చేరకపోవడంతో సంయమనం కోల్పోతున్నారని విమర్శించారు. "రూ.18 వేల కోట్లు పెట్టి కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డిని కొన్నారు. ఈటల ఆరోపణలు నిజమైతే.. రేవంత్‌రెడ్డి సవాల్ స్వీకరించాలి. దమ్ముంటే భాగ్యలక్ష్మి అమ్మవారి ఆలయానికి వచ్చి ప్రమాణం చేయాలి. ప్రధాని మోదీ, హోం మంత్రి అమిత్ షా దగ్గర మార్కులు కొట్టేందుకే ఈటల ఆరోపణలు చేశారు. కాంగ్రెస్‌లో చేరేందుకు ఈటల గతంలో రేవంత్‌రెడ్డితో సంప్రదింపులు జరిపారు. వ్యాపారాలు కాపాడుకునేందుకే ఈటల బిజెపిలో చేరారు" అని అద్దంకి దయాకర్ విమర్శించారు.

ఐకెపి విఒఎల సమస్యలు పరిష్కరించండి

సిఎం కెసిఆర్‌కు తమ్మినేని లేఖ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న ఐకెపి విఒఎల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తద్వారా వారు చేస్తున్న సమ్మెను విరమింపజేయాలని కోరారు. ఈ మేరకు ముఖ్యమంత్రి చంద్రశేఖర్‌రావుకు శనివారం ఆయన లేఖ రాశారు. రాష్ట్ర వ్యాప్తంగా 17,608 మంది ఐకెపి విఒఎలు గత 20 ఏండ్లుగా పనిచేస్తున్నారని తెలిపారు. వారికి ఉద్యోగ భద్రత, గుర్తింపు కార్డులు, పదోన్నతులతోపాటు, సాధారణ, ఆరోగ్య బీమా సౌకర్యం లేదని పేర్కొన్నారు. వాటి సాధనకోసం రాష్ట్ర వ్యాప్తంగా ఐకెపి విఒఎలు చాలా కాలంగా పలు నిరసన కార్యక్రమాలు చేసినా, ప్రభుత్వం నుంచి స్పందన లేదని వివరించారు. దీంతో ఆరు రోజులుగా మండల కేంద్రాల్లో నిరవధిక సమ్మెకు పూనుకున్నారని తెలిపారు. రాష్ట్రంలో మహిళల అభ్యున్నతికోసం డ్వాక్రా సంఘాలను ఏర్పాటు చేస్తూ, వారు ఆర్థికంగా, సామాజికంగా ఎదగడానికి అవగాహన కల్పిస్తున్నారని పేర్కొన్నారు. సభ్యులకు రుణాలు ఇప్పించి చిన్నచిన్న వ్యాపారాలు చేసుకునేలా ప్రోత్సహిస్తున్నారని వివరించారు. డ్వాక్రా సంఘాల లావాదేవీలన్నీ రికార్డు చేస్తూ ఎస్‌హెచ్‌జీ లైవ్ మీటింగ్ పెట్టి ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారని తెలిపారు. సంఘాల పనులే కాకుండా ప్రభుత్వ సంక్షేమ పథకాలు కూడా అమలయ్యేలా వారు కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. అయినా వారికి పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్) నుంచి కేవలం రూ.3,900లు మాత్రమే గౌరవవేతనం ఇస్తూ చేతులు దులుపేసుకుంటున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. గ్రామసంఘం గ్రేడింగ్‌తో సంబంధం లేకుండా ప్రతినెలా విఒఎల వ్యక్తిగత ఖాతాల్లోకి కనీస వేతనంగా రూ.26 వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. వారిని సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించి, గుర్తింపు కార్డులివ్వాలివ్వడంతో పాటు, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. రూ.10 లక్షల సాధారణ, ఆరోగ్య బీమా సౌకర్యం కల్పించాలని కోరారు. జాబ్ చార్టర్‌తో సంబంధం లేని ఆన్‌లైన్ పనులను వారితో చేయించొద్దని సూచించారు. వారిపైన మహిళా సంఘాల ఒత్తిడి లేకుండా ఎస్‌హెచ్‌జీలకు వీఎల్ఆర్, అర్హులైన వీవోఏలను సీసీలుగా పదోన్నతి కల్పించాలని తమ్మినేని ఈ సందర్భంగా తెలిపారు. వారి న్యాయమైన డిమాండ్ల పట్ల సీఎం కేసీఆర్ సానుకూలంగా స్పందించి, ఐకెపి విఒఎలకు న్యాయం చేయాలని ఆయన తన లేఖలో కోరారు.

సిమెంట్ పరిశ్రమ అభివృద్ధికి చేయూత

- భారతీయ రైల్వే, సిమెంట్ పరిశ్రమ కంపెనీల జాతీయ స్థాయి సమావేశంలో అధికారుల భరోసా

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

సిమెంట్ పరిశ్రమల అభివృద్ధి, రవాణకు చేయూతనందిస్తామని రైల్వే బోర్డు, దక్షిణ మధ్య రైల్వే అధికారులు భరోసా కల్పించారు. సిమెంట్ తయారీదారుల సంఘం ఆధ్వర్యంలో భారతీయ రైల్వే అధికారులు, సిమెంట్ పరిశ్రమ ప్రతినిధుల ఉమ్మడి జాతీయ స్థాయి సమావేశాన్ని శనివారం హైదరాబాద్‌లోని ఐటిసి కాకతీయ హోటల్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా సిమెంట్ రంగానికి సంబంధించిన వివిధ సమస్యలు, సిమెంట్ పరిశ్రమ భవిష్యత్తులో మరింత వృద్ధి సాధించేందుకు అవసరమైన మౌలిక సదుపాయాలు, సిమెంట్ రవాణాకు సహాయపడే విధానపరమైన, లాజిస్టిక్‌లను మెరుగుపరచడం తదితర అంశాలపై ఈ సమావేశంలో చర్చించారు.

గత ఆర్థిక సంవత్సరంలో భారతీయ రైల్వే 144 మిలియన్ టన్నుల సిమెంట్, క్లింకర్ లోడింగ్‌ను నమోదు చేసింది. సిమెంట్ రవాణాలో అగ్రగామి జోన్‌లలో ఒకటైన దక్షిణ మధ్య రైల్వే, 2021-22లో 34.108 మిలియన్ టన్నులతో పోల్చితే 2022-23లో 34.499 మిలియన్ టన్నుల సిమెంట్ లోడింగ్‌ను సాధించింది. దక్షిణ మధ్య రైల్వే సిమెంట్, క్లింకర్‌లో జోన్ గతంలో సాధించిన లోడింగ్ కంటే ఇదే అత్యుత్తమ లోడింగ్ ఇదే.

భారతీయ రైల్వేలు, దక్షిణ మధ్య రైల్వేతో సహా సిమెంట్ రవాణాను మెరుగుపరచడానికి ఇటీవలి కాలంలో వివిధ టారిఫ్, నాన్-టారిఫ్ వంటి చర్యలను అమలు చేస్తున్నాయి. ఇప్పటికే ఉన్న ట్రాఫిక్‌ను బలోపేతం చేయడమే కాకుండా లోడింగ్ పాయింట్‌లను తెరవడానికి కూడా జోనల్, డివిజనల్ స్థాయిల్లో బిజినెస్ డెవలప్‌మెంట్ యూనిట్లు ఏర్పాటు చేశారు. ఈ నేపథ్యంలో, రైల్వేల ద్వారా సిమెంట్ లోడింగ్‌ను మరింత బలోపేతం చేసేందుకు పరిశ్రమల యాజమాన్యాల అభిప్రాయాలను తెలుసుకునేందుకు వీలుగా నిర్ణయించిన సమావేశం మరో ముఖ్యమైన అడుగు అని చెప్పొచ్చు. సిమెంట్ తయారీదారుల సంఘం ఆ రంగం వృద్ధి, మొత్తం లాజిస్టిక్స్ సంబంధిత అంశాలు వివిధ ప్లాంట్ల స్థాపిత సామర్థ్యాలలో వృద్ధి, సిమెంట్ పరిశ్రమకు వ్యూహాత్మక భాగస్వామిగా రైల్వేల పాత్ర సమీప భవిష్యత్తులో అంచనా వేయాల్సిన వాల్యూమ్‌లకు సంబంధించిన వివిధ అంశాలను పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా వివరించారు. దీనికి సంబంధించి విధానపరమైన సహకారంపై ఈ సమావేశంలో చర్చించారు. అభివృద్ధి చెందుతున్న సిమెంట్ రంగానికి సహకారం అందిస్తామని రైల్వే బోర్డు, దక్షిణ మధ్య రైల్వేకు చెందిన సీనియర్ అధికారులు హామీ ఇచ్చారు. మౌలిక సదుపాయాల ప్రాజెక్టులను కూడా వివరించారు. ఈ సమావేశంలో ట్రాఫిక్ అండ్ ట్రాన్స్‌పోర్టేషన్ ప్రిన్సిపల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మనోజ్‌కుమార్ శ్రీవాస్తవ, న్యూఢిల్లీలోని రైల్వే బోర్డు నుంచి బిజినెస్ డెవలప్‌మెంట్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కమలేష్‌కుమార్ మిశ్రా పాల్గొన్నారు. వీరితో పాటు దక్షిణ మధ్య రైల్వే ప్రిన్సిపల్ చీఫ్ కమర్షియల్ మేనేజర్ రవీన్‌కుమార్‌రెడ్డి, ప్రిన్సిపల్ చీఫ్ ఆపరేషన్స్ మేనేజర్ బి.నాగ్య, రైల్వే బోర్డుపాటు దక్షిణ మధ్య రైల్వే, పశ్చిమ రైల్వే, కాంకర్ అధికారుల బృందం, సిమెంట్ పరిశ్రమల నుంచి అల్ట్రాటెక్, వాసవదత్తా, మైహోమ్, భారతి, పెన్నా, దాల్మియా, ఓరియంట్, జిందాల్ మొదలైన వివిధ సిమెంట్ పరిశ్రమల ప్రతినిధులు పాల్గొన్నారు.